క్లుప్తంగా

రాజాపూర్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం



రాజాపూర్‌: దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేద వైద్యంతో తగ్గించుకోవచ్చని ఎంపీడీఓ మశ్చందర్‌ పేర్కొన్నారు. శుక్రవారం ఆయుష్‌ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత వృద్ధాప్య వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు హరికుమార్‌ మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులకు చెక్‌పెట్టేందుకు ఆయుర్వేదం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిబిరంలో 84 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రోగ్రాం జిల్లా అధికారి సురేష్‌ నాయక్‌, డాక్టర్లు రాజేందర్‌, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

రాజాపూర్‌: పేదలకు ప్రజలకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ వరమని కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు నరహరి, భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారికి మంజూరైన చెక్కులను అందజేసి మాట్లాడారు. వెంకట్‌రెడ్డి, విక్రంరెడ్డి, శ్రీశైలంయాదవ్‌, మాధవాచారి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

మహమ్మదాబాద్‌: ఉమ్మడి మండల పరిధిలోని లబ్ధిదారులకు శనివారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు గండేడ్‌, మహమ్మదాబాద్‌ మండలాల కాంగ్రెస్‌ అధ్యక్షులు కేఎం నారాయణ, జితేందర్‌రెడ్డి శుక్రవారం వివరాలు తెలియజేశారు. నంచర్లలో కార్యక్రమం ఉంటుందని వివరించారు.

18న టెంకాయల వేలం

గండేడ్‌: శ్రావణ మాసం చివర నిర్వహించే జాతరను పురస్కరించుకుని గోవింద్‌పల్లి సమీపంలోని గట్టు చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించి ఈనెల 18న టెంకాయల వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థాన కమిటీ వారు వివరాలను శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా లడ్డు, పులిహోర, తలనీలాల వేలం పాట సైతం ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ. 500 డిపాజిట్‌ చేయాల్సి ఉంటుందన్నారు.

విద్యుత్‌ సరఫరా నిలవడంతో అవస్థలు

జడ్చర్ల: నియోజకవర్గంలో శుక్రవారం భారీ వర్షం కురువడంతో విద్యుత్‌ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో జడ్చర్ల పట్టణ ప్రజలతో పాటు సమీప ప్రాంతాల వారు తీవ్రంగా అవస్థలు పడ్డారు. ముఖ్యంగా పట్టణంలో దాదాపు మూడు గంటలకు పైగా ఏకబిగిన విద్యుత్‌ సరఫరా లేకుండా పోవడంతో పనులకు తీవ్ర ఆటకం కలిగిందని ప్రజలు వాపోయారు.

బ్రోచర్‌ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్‌ క్రీడలు: జీకే మాస్టర్‌ షోటోకాన్‌ కరాటే డూ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో జడ్చర్ల పట్టణంలో 19వ నేషనల్‌ లెవల్‌ ఇన్విటేషన్‌ కరాటే (వీఐపీ చాలెంజర్స్‌) చాంపియన్‌షిప్‌ నిర్వహిస్తున్నట్లు టోర్నీ చీఫ్‌ ఆర్గనైజర్‌ అశ్వాక్‌ తెలిపారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో చాంపియన్‌షిప్‌కు సంబంధించిన బ్రోచర్లను వీఐపీ అకాడమీ అధ్యక్షులు ధ్రువ బాద్మి, జీకే మాస్టర్‌ షోటోకాన్‌ ఫౌండర్‌ జి.కృష్ణయ్య, టోర్నమెంట్‌ డైరెక్టర్‌ ఇంలియాజ్‌ బిన్‌ సిద్ధిఖ్‌ ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాల నుంచి కరాటే విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. మాస్టర్లు శివకుమార్‌, రాజు, జాకీర్‌, గౌస్‌, శ్రీధర్‌, నవీన్‌, సత్యనారాయణ, లక్ష్మణ్‌, షకీల్‌ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్‌ ఢీ: మూడు గొర్రెలు మృతి

మహమ్మదాబాద్‌: టిప్పర్‌ ఢీ కొని మూడు గొర్రెలు మృతిచెందిన ఘటన మహమ్మదాబాద్‌ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన కాపరి తన గొర్రెలను మేతకు తీసుకెళ్లి రోడ్డుపై నుంచి మహమ్మదాబాద్‌ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌ వెళ్తున్న కంకర టిప్పర్‌ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి పక్కనే వెళ్తున్న గొర్రెలను ఢీకొంది. ఘటనలో మూడు గొర్రెలు అక్కడికక్కడే తీవ్రంగా గాయపడి మృతిచెందాయి. టిప్పర్‌ ఆటోకు కూడా స్వల్పంగా తాకింది. కాగా అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి సైతం స్వల్ప గాయాలు అయ్యాయి. ఆయనను స్థానిక ఆస్పత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స చేయించారు.

వివాహిత అదృశ్యం

మిడ్జిల్‌: బైరంపల్లికి చెందిన వివాహిత.. జ్యోతి(38) శుక్రవారం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు కథనం ప్రకారం.. సదరు మహిళ ఉదయం ఇంటి నుంచి జడ్చర్లకు బయలుదేరి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. ఫోన్‌ కూడా స్విచ్‌ఆఫ్‌ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.



తామరపువ్వులతో ప్రత్యేక అలంకరణ



రేణుక ఎల్లమ్మ అమ్మవారు



నాగశిలలకు పాలు పోస్తున్న భక్తులు

వరలక్ష్మీ నమోస్తుతే..



రేణుక ఎల్లమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు



వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు

సాక్షినెట్‌వర్క్‌: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆలయాల్లో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు భక్తశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పలువురు ఇళ్లలోనూ కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు. నైవేద్యాలు సమర్పించారు. బ్రాహ్మణవాడీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వీరన్నపేటలోని చౌడేశ్వరీ మాత ఆలయం, వేంకటేశ్వర కాలనీలోని రాజరాజేశ్వరి ఆలయం, రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం, పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. బాలానగర్‌, భూత్పూర్‌ మున్సిపాలిటీ, జడ్చర్ల, రాజాపూర్‌, దేవరకద్ర, నవాబుపేట తదితర మండల కేంద్రాలు, గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు వాయినాలు ఇచ్చుకున్నారు.



బాదేపల్లిలో..



రాజాపూర్‌లో..



దేవరకద్రలో..

వార్డుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: వార్డుల పర్యటనలో భాగంగా.. శుక్రవారం 21వ వార్డు పరిధిలోని ఫారుక్‌ మజీద్‌ ప్రాంతంతో పాటు 47వ వార్డులోని కొత్తగంజి, హనుమాన్‌నగర్‌ను మున్సిపల్‌ చైర్మన్‌ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్‌ పరిశీలించారు. కాగా చాలావరకు డ్రెయినేజీలు, సీసీరోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల బెడద నివారణకు ఓపెన్‌ ప్లాట్లలో చెత్తాచెదారం, ముళ్లకంపలు ఉండకుండా చూసుకోవాలన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంతవరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కొత్తగంజ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న అజీమ్‌ కుటుంబాన్ని పరామర్శించారు. వీరహనుమాన్‌ యువజన సంఘం ఆధ్వర్యంలో వారికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వైస్‌ చైర్మన్‌ షబ్బీర్‌అహ్మద్‌, కౌన్సిలర్‌ జాజిమొగ్గ నర్సింహులు, ఎంఈ యు.బస్వరాజ్‌, డీఈఈ సందీప్‌, స్థానికులు పాల్గొన్నారు.



డ్రెయినేజీని పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ ఆనంద్‌కుమార్‌గౌడ్‌

పాలమూరులో పరిశుభ్రత చర్యలు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని అన్ని వార్డుల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో మున్సిపల్‌ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పలు చోట్ల తొట్లు, సంప్‌ లలో ఎక్కువ రోజులు నిల్వ చేసిన నీటిని పారబోయించారు. ఫినాయిల్‌ చల్లి, దోమల నివారణకు రసాయన మందులు పిచికారీ చేశారు. కాగా, 17వ వార్డు పరిధిలోని దొడ్డలోనిపల్లి, కోయనగర్‌ తదితర ప్రాంతాలలో మున్సిపల్‌ కమిషనర్‌ డి.మహేశ్వర్‌రెడ్డి తనిఖీ చేసి సిబ్బందితో పాటు ప్రజలకు తగు సూచనలిచ్చారు. ముఖ్యంగా ఓపెన్‌ ప్లాట్లలో మురికి కంప చెట్లు తొలగించాలని, ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం వేయొద్దన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలకు నిలయంగా మారుతుందన్నారు. వీటి నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.



నిల్వ నీటిని పారబోయిస్తున్న కమిషనర్‌ మహేశ్వర్‌రెడ్డి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: మున్సిపల్‌ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్‌ చేశారు. కొన్నిరోజులుగా తాము సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తున్నా అధికారులకు పట్టింపు లేకపోవడం అన్యాయం అన్నారు. శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఇటీవల సీఐటీయూ జిల్లా నాయకులు జడ్చర్లకు వచ్చిన సందర్భంలో స్థానిక మున్సిపల్‌ కమిషనర్‌ రాజయ్యకు ఫోన్‌ చేయగా నాయకులు తనతో మాట్లాడాల్సింది ఏమీ లేదని.. తాను కార్మికులతోనే మాట్లాడుతానంటూ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారని ఆరోపించారు. విషయాన్ని కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లామని.. జెడ్పీ సీఈఓను చర్చలకు పంపిస్తానని హామీ ఇవ్వడంతో తాము విధులకు హాజరయ్యామని తెలిపారు. వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మిక సంఘం అధ్యక్షుడు మహేశ్‌, కేశవులు, నర్సింహులు, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మున్సిపల్‌ కార్మికులు

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

దేవరకద్ర రూరల్‌: నూతనంగా ఏర్పాటు చేసిన కౌకుంట్ల మండల కేంద్రంలో అవసరమైన అన్ని వసతులను, కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ.. శుక్రవారం కౌకుంట్ల మండల ప్రజలు, స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యాలయాలు అందుబాటులో లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రికి వివరించారు. అలాగే నూతన మండలానికి సంబంధించి గత ప్రభుత్వం నోటిఫై చేయకపోవడంతో అధికారులకు జీతాలు రావడం లేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. కాగా సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అరవింద్‌ కుమార్‌ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు

నిధులు కేటాయించండి

మహమ్మదాబాద్‌: మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ ఆర్గనైజింగ్‌ కార్యదర్శి రాములు శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. మండల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధుల గురించి వివరించారు. మహమ్మదాబాద్‌ అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నందున అత్యధిక నిధులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండలానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఉన్నతంగా ఎదగాలి

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్‌ కోచింగ్‌ 5వ బ్యాచ్‌ ముగిసిన నేపథ్యంలో విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్సీ సంక్షేమశాఖ అధికారి ఛత్రునాయక్‌ మాట్లాడారు. విద్యార్థులు స్టడీసర్కిల్‌లో కల్పించే వసతులను వినియోగించుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్‌ సీఐ అప్పయ్య, స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ కాడం శ్రీనివాస్‌, అధ్యాపకుడు రాజిరెడ్డి పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనపై ఆరా

జడ్చర్ల టౌన్‌: జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి శుక్రవారం జడ్చర్ల–మహబూబ్‌నగర్‌ ప్రధాన రహదారిపై మల్లెబోయిన్‌పల్లిగేట్‌ వద్ద ఉన్న ఎస్టీ మినీ గురుకులాన్ని తనిఖీ చేశారు. హాస్టల్‌లో రికార్డులు, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సదుపాయాలు, భోజనం ఎలా ఉందని ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం చేసి వంటకాలను పరిశీలించారు. ఉపాధ్యాయురాలు గిరిజ జెడ్పీసీఈఓకు వివిధ విషయాల వివరాలు తెలియజేశారు.

కురుమూర్తి ఆలయం వద్ద పారిశుద్ధ్య లోపం



చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆలయం వద్ద అధికారుల నిర్లక్ష్యంతో పారిశుద్ధ్యం లోపిస్తోంది. దీంతో శుక్రవారం ఆలయానికి తరలివచ్చిన భక్తులు అవస్థలు పడ్డారు. ఆలయ పరిసరాల్లో, కొండ దిగువన రాజగోపురం వద్ద చెత్త చెదారం, ప్లాస్టిక్‌ కవర్లు, తెగిపడిన పాత చెప్పులు, ఖాళీ బీరు సీసాలు పడి ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నగదు బహుమతులు

దేవరకద్ర రూరల్‌: లక్ష్మీపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (2023–24 విద్యా సంవత్సరంలో) పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు సునీత, భవానీలను శుక్రవారం గ్రామస్తులు అభినందించారు. మాజీ సర్పంచ్‌ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయుడు వెంకట్రాములు ఇద్దరు కలిసి రూ. 5 వేల నగదు బహుమతిగా అందించారు.

అటెన్షన్‌ ప్లీజ్‌



గండేడ్‌ మండల కేంద్రంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా పెద్ద గుంతలు

ప్రమాదకరంగా గుంతలు

గండేడ్‌: మండల కేంద్రంలోని మెయిన్‌ రోడ్డు పక్కన పెద్ద గుంత ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పనులు సాగుతుండగా.. రెండు వైపులా కొద్ది దూరం సర్వీసు రోడ్డు నిర్మించారు. కుడివైపు ఉన్న రోడ్డు గుండా మండల కార్యాలయాలకు వెళ్లడానికి అనువుగా ఉంటుంది. ఈ రోడ్డుపై మెటల్‌ పూర్తయ్యాక బీటి కూడా వేశారు. కొద్దిదూరం ఇంకా బీటీ వేయాల్సి ఉంది. అయితే సల్కర్‌పేట్‌ వైపు డ్రెయినేజీ చివర పనులు చేయాల్సి ఉంది. దీని కారణంగా సర్వీసు రోడ్డు మీదుగా వెళ్లకుండా మట్టి పోశారు. కేవలం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు మాత్రమే దారి వదిలారు. అయితే ఇటు డ్రెయినేజీ వైపు అటు కల్వర్టు వైపు పెద్ద గుంతలు ఉండడంతో పలు మార్లు బైక్‌పై వెళ్లేవారు గాయాల పాలయ్యారు. దీంతో త్వరితగతిన రోడ్డు బాగుచేయాల్సిన అవసర ముందని స్థానికులు అంటున్నారు.

సంప్రదించాల్సిన అధికారి నాగమణి, నేషనల్‌ హైవే డీఈఈ | ఫోన్‌ నంబరు- 83339 25226

టీబీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

గండేడ్‌: గ్రామాల్లోని ప్రజలు టీబీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గండేడ్‌ మెడికల్‌ ఆఫీసర్‌ చంద్రశేఖర్‌ పేర్కొన్నారు. శుక్రవారం పగిడ్యాల్‌లో టీబీ క్యాంపు నిర్వహించారు. పొగతాగడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడాలని అన్నారు. శిబిరంలో పగిడ్యాల్‌, తువ్వగడ్డ తండా, పరుగుల తండాల ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. కాగా 123 మందికి వైద్యులు ఎక్స్‌రే తీశారు. 10 మందికి తెమడ పరీక్షలు చేశారు. డాక్టర్‌ ఆరీఫ్‌, సూపర్‌వైజర్‌ పుష్పవేణి పాల్గొన్నారు.

కూరగాయల సంతలో బలవంతపు వసూళ్లు

- హిజ్రాలపై చర్యలు తీసుకోవాలంటున్న రైతులు, వ్యాపారులు



రాజాపూర్‌(బాలానగర్‌): బాలానగర్‌ మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంతలో హిజ్రాలు కూరగాయల వ్యాపారులను, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. డబ్బులు ఇవ్వాలని తమను వేధిస్తున్నారని.. ప్రతివారం అవస్థలు తప్పడం లేదని శుక్రవారం పలువురు రైతులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి తైబజార్‌ కట్టి తాము కూరగాయలు విక్రయిస్తుంటామని.. అయితే వీరి నుంచి ఎదురయ్యే ఇబ్బందులు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని అన్నారు. బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వాపోయారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రైవేట్‌లో రిజర్వేషన్లు అమలు చేయాలి

అడ్డాకుల: అట్టడుగు వర్గాలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేస్తేనే సామాజిక న్యాయం సిద్ధిస్తుందని కేవీపీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌ బాబు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కేవీపీఎస్‌ ఆధ్వర్యంలో నాటి స్వాతంత్రం, నేటి సామాజిక న్యాయం అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ సర్కార్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్‌ శక్తులకు అమ్మేసిందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి కురుమయ్య, మాణిక్యంరాజు, బాలరాజు, ప్రసాద్‌, ఖాసీం, నర్సింహ్మా, ప్రశాంత్‌ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ స్వాధీనం

రాజాపూర్‌: మండల పరిధిలోని రాయపల్లి శివారులో ఎలాంటి అనుమతి లేకుండా కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నట్లు పోలీసులకు శుక్రవారం సమాచారం అందింది. దీంతో సాయంత్రం రాజాపూర్‌ పోలీసులు అక్కడికి వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజాపూర్‌ ఎస్‌ఐ రవి మాట్లాడారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవాబుపేట: కాకర్లపహాడ్‌ సమీపంలో పలుగు మర్రి చెంత శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. కాగా కాకర్లపహాడ్‌ నుంచి పాలానికి వస్తుండగా ఘటన జరిగిందని..శంకరయ్య అనే వ్యక్తితో పాటు మరొకరు గాయపడ్డారని స్థానికులు తెలిపారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. కాగా పూర్తి సమాచారం తెలియరాలేదు.

హిందువుల రక్షణకు కృషిచేయాలి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: బంగ్లాదేశ్‌లోని హిందూ మైనార్టీల రక్షణ కోసం తక్షణమే యూఎన్‌ఓ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని, వారికి సంపూర్ణ రక్షణ, మతసంస్థలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్త హనీఫ్‌ అహ్మద్‌ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌ సహ ప్రపంచవ్యాప్తంగా మైనార్టీల పరిస్థితి ఆందోళన కరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లిష్టమైన సమయంలో మానవతావాదులు స్పందించి బాధితులకు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో శాంతియూత వాతావరణంలో నెలకొల్పేందుకు భారత్‌ తనవంతు కృషి చేయాలని, అదే విధంగా వివిధ దేశాల ఎంబీసీలు చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు భూత్పూర్‌ బంద్‌

భూత్పూర్‌: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా శనివారం భూత్పూర్‌ పట్టణ బంద్‌ చేపట్టనున్నారు. ఈమేరకు బీజేపీ భూత్పూర్‌ పట్టణ శాఖ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మ్యాతరి రాము శుక్రవారం వివరాలు తెలిపారు. పట్టణంలోని వ్యాపారస్తులు, విద్యాసంస్థలు, హోటళ్ల యజమానులు సహకరించాలని కోరారు.

జడ్చర్లలో ఆస్పత్రులు..

జడ్చర్ల: ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌, జడ్చర్ల డాక్టర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రైవేట్‌ ఆస్పత్రుల బంద్‌ చేపట్టనున్నారు. కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.